క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ రక్షణ



మొక్కను నాటుతున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: మండలంలోని అద్వాన్నంపేట ఎంపీపీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వివిధ రకాల మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ కూర్మాన అరుణకుమారి, ఉపాధ్యాయురాలు సీతమ్మ, స్థానిక యువకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



చంద్రయ్యపేట పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జి.సిగడాం: కిశోరి బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. చంద్రయ్యపేట యూపీ పాఠశాలలో పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల నిర్మూళన, బాల్య వివాహాల నియంత్రణపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు ప్రత్యేక నిఘా వేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పేకల రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

బుడగుట్లపాలెంలో గ్రామ దేవత ఉత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెంలోని కొత్తమ్మతల్లి గ్రామ దేవత ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కొంగరాం పంచాయతీలో నీటి నమూనాల సేకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: కొంగరాం పంచాయతీ పరిధి కొంగరాం, చినకొంగరాం, ఏసీఎన్ పేట గ్రామాల్లో మంచినీటిబావులు, బోరు బావుల నుంచి నీటి శాంపిళ్లలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డి.హేమలత ఆధ్వర్యంలోని బృందం మంగళవారం సేకరించింది. స్థానికంగా ఉన్న ఓ రసాయన పరిశ్రమ వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయని స్థానికులు సోమవారం జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో నిర్వహించిన మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ సెల్)లో ఫిర్యాదు చేశారు. దీంతో నీటిని ల్యాబ్‌ల్లో పరీక్షించాలని ఉన్నత అధికారులు సూచించారు. నీటి నమూరాలు పరీక్షించి, ఫలితాలు త్వరలో ప్రజలకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. కాగా పరిశ్రమ ఆవరణలో ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులకు పండ్లు పంపిణీ



పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనోవికాస కేంద్రంలో మంగళవారం దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు పైడి చంద్రరావు, ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి, జనరల్ సెక్రటరీ తోనంగి వెంకన్న యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి, రత్నాల మురళీమోహన్, వైస్ ప్రెసిడెంట్ మైలపిల్లి నరసింహమూర్తి, కుప్పిలి నరసింహమూర్తి, ప్రఫుల్లకుమార్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో అధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం సంతోషదాయకమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. బంటుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండములగాం ఆదర్శ పాఠశాల నుంచే 20 మంది ట్రిపుల్ ఐటీకి కావడం అభినందనీయమన్నారు. చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పాట్నూరు శ్రీధర్ ఉన్నారు.

పేదల ఫైలును.. పక్కన పెట్టేశారు!

- అమలుకు నోచుకోని సర్క్యులేషన్ ప్యాట్రన్
- ఇరుకు ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టే వారికి ఉపయోగపడేలా రూపకల్పన
- నగర పాలక సంస్థకూ ఆదాయం సమకూరే అవకాశం
- ఉద్దేశపూర్వకంగానే జాప్యం జరుగుతోందన్న విమర్శలు



శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

శ్రీకాకుళం: రాష్ట్రంలోనే తొలిసారిగా శ్రీకాకుళం నగర పాలక సంస్థలో సర్క్యులేషన్ ప్యాట్రన్ పేరిట పేదలు ఇళ్లు కట్టుకునే ప్రక్రియకు సంబంధించిన ఫైలును అధికారులు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 8 నెలల కిందట అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు రాష్ట్రస్థాయిలో అధికారులతో మాట్లాడి సర్క్యులేషన్ ప్యాట్రన్ అంశాన్ని ఆమోదింపజేశారు. నిబంధనల ప్రకారం 15 అడుగుల లోపు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించాలనుకుంటే ప్లాన్ అప్రూవల్ సాధ్యం కాదు. ఎవరైనా ఆయా ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోవాలనుకుంటే 10 అడుగుల స్థలాన్ని మున్సిపాలిటీకి వదలాల్సి ఉంటుంది. ఈ నిబంధన వల్ల నగరంలో పేదలు ఎక్కువగా నష్టపోయారు. ఇటువంటి ఇరుకు రోడ్డు, మురికివాడలు, గ్రామ వాతావారణం ఉన్న ప్రాంతాల్లో పేదలు మాత్రమే ఎక్కువగా నివసిస్తున్నారు.

ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. అక్కడక్కడ ఖాళీ స్థలాలు మాత్రమే ఉన్నాయి. ఇటువంటి వారు ప్రస్తుతం ఇళ్లు కట్టుకోవాలనుకుంటే సాధ్యపడటం లేదు. గత ప్రభుత్వం దృష్టికి సమస్యను ధర్మాన తీసుకెళ్లడంతో అటువంటి ప్రాంతాల్లో ప్లానులు అనుమతించాలని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు మేరకు నగర పాలక సంస్థ నోటీసు బోర్డులో ఉంచి, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని సర్కారు సూచించింది. దీని ప్రకారం నోటీసు బోర్డులో ఉంచగా, ఒక్క అభ్యంతరం రాకపోగా, తమ ప్రాంతాలను కూడా ఈ పరిధిలోకి తీసుకురావాలని వినతులు వచ్చాయి. ఈ మేరకు నగర పాలక సంస్థ అధికారులు దానిని ఆమోదించి అమలు చేయాల్సి ఉంది. ఏ కారణం చేతనో అప్పటి జిల్లా కలెక్టర్, నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి శ్రీకేష్ బి.లాఠకర్ నెలల తరబడి తన వద్ద ఉంచేశారు. ఆయనకు బదిలీ తర్వాత కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మనజీర్ సమూన్ జిలాని ఫైల్‌ను ఆమోదిస్తారని అందరూ భావించారు. ఆయన సతీమణి అన్సారియా నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఉండటంతో ఆమె కలెక్టర్‌తో ఆమోదింపజేస్తారని భావించారు. ఎన్నికల్లో బిజీగా ఉన్నామంటూ ఫైల్‌ను నగరపాలక సంస్థ అధికారులు కమిషనర్ వద్దకు కూడా తీసుకెళ్లలేదు. ఎన్నికల అనంతరం కలెక్టర్ వద్దకు తీసుకెళ్లగా ఆయన పరిశీలించి చిన్నచిన్న మార్పులను సూచిస్తూ వాటిని సరిచేసిన తర్వాత తన వద్దకు తీసుకురావాలని టౌన్ ప్లానింగ్ విభాగపు అధికారులకు చెప్పారు. ఈ పనిని ఒక్క రోజులో పూర్తి చేసే అవకాశమున్నా, రెండు నెలల పాటు చేయకుండా ఫైల్‌ను తమ వద్దే ఉంచుకున్నారు. ఇంతలో కమిషనర్‌కు బదిలీ అవ్వడం, తరువాత కలెక్టర్ కూడా బదిలీ కావడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుత ఎమ్మెల్యే గొండు శంకర్ ఎన్నికల ప్రచారం సందర్భంగా సర్క్యులేషన్ ప్యాట్రన్ అంశాన్ని లేవనెత్తారు. ఎన్నికల తర్వాత కూడా ఈ ఫైల్ ఏదని ప్రశ్నించినప్పటికీ నగర పాలక సంస్థ అధికారులు సరైన సమాధానం చెప్పకుండా దాటవేశారు. నగర పాలక సంస్థలోని ప్రణాళికా విభాగంలో కొందరు అధికారుల వైఖరి వల్లే ఈ ఫైల్‌కు మోక్షం కలగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి సర్క్యులేషన్ ప్యాట్రన్‌కు మోక్షం కలిగిస్తే సుమారు ఐదువందల మంది వరకు ఇళ్లు కట్టుకొని లాభపడటంతో పాటు నగర పాలక సంస్థకు పన్నుల రూపంలక్ష ఆదాయం సమకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



బొందిలీపురం ప్రాంతంలోని ఇరుకు రోడ్డు

త్వరలోనే కలెక్టర్‌కు నివేదన

సర్క్యులేషన్ ప్యాట్రన్ అంశం కొత్త కలెక్టర్‌కు రెండు మూడు రోజుల్లో నివేదిస్తాం. ఎనిమిది నెలల కిందట 15 రోజులకు పైగా కష్టపడి ఫైళ్లు సిద్ధం చేశాం. మా కష్టాన్నీ, పేదలకు ఉపయోగపడే అంశాన్ని నిర్లక్ష్యం చేయం. త్వరలోనే ఈ అంశం కలెక్టర్ ఆమోదం పొందేలా చూస్తాం.

– ఓబులేసు, ఇన్‌చార్జి కమిషనర్

56 వంటకాలతో నైవేద్యం



శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధిలో షిరిడీ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథయాత్ర సందర్భంగా స్వామి వారు శేషపాన్పు అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 56 రకాల పిండివంటలతో నైవేద్యాలు సమర్పించారు.

– శ్రీకాకుళం కల్చరల్

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ద్విచక్ర వాహనచోదకులు అకస్మాత్తుగా ప్రమాదాలకు గురైతే హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మోటారు వాహన చట్టంలో నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరప్రసాద్, పి.బి.మల్లేశ్వరరావు, డివిజనల్ మేనేజర్ కె.రవిశంకర్, యు.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి సన్యాసినాయుడు

విత్తన బంతుల తయారీపై శిక్షణ



శిక్షణ నిర్వహిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: రవిశంకర్ గురూజీ ఆదేశాల మేరకు జూన్ 5 నుంచి ఆగస్టు 19 వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు తెలిపారు. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలోని విశాఖ స్కూల్లో మంగళవారం విద్యార్థులకు సీడ్‌బాల్స్(విత్తన బంతులు) తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని గురూజీ ఇచ్చిన పిలుపు మేరకు పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యతపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్లపూడి రవి మాట్లాడుతూ మొక్కల పెంచడానికి అవసరమైన సీడ్ బాల్స్‌ను ఎలా తయారు చేయాలనే అంశంపై ఈ నెలాఖరులోగా 20 పాఠశాలలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 200మంది విద్యార్థులతో 800 విత్తన బంతులు తయారు చేసినట్లు వివరించారు. వీటిని డ్రోన్స్ ద్వారా గాని, ఇండియన్ నేవీ ద్వారా గానీ వర్షపాతం తక్కువగా ఉన్న మండలాలు, కొండ ప్రాంతాల్లో వెదజల్లుతామని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ అధినేత తమ్మినేని మధుసూదనరావు, ప్రధానోపాధ్యాయులు రామారావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు బెవర రవిశంకర్, టీచర్లు వారణాసి సందీప్, దేసూళ సురేంద్ర, వలంటీర్ పి.శ్రీనివాస్, సీటీసీ మెంబర్ అన్నపూర్ణ, అను తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి

- సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజా సమస్యలు దాదాపుగా సచివాలయ స్థాయిలోనే పరిష్కారం కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే కమిషనర్లు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. శ్రీకాకుళం నగరం కార్పొరేషన్‌గా రూపాంతరం చెందినా ఆ స్థాయిలో సౌకర్యాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్థాయికి సరిపడా సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తానన్నారు. తాము కక్ష సాధింపు చర్యలకు పోబోమని, అధికారులు, సచివాలయ సిబ్బంది అపోహలు వీడి విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. టీడీపీ నాయకులు, వార్డ్ ఇన్‌చార్జిలకు తగిన గౌరవం ఇవ్వాలని సూచించారు. 48 సచివాలయాలను నాలుగు జోన్లుగా విభజించి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. విలీన పంచాయితీల పరిధిలో సచివాలయాలకు సైతం కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నందున నగరంలోని ప్రధాన సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జిలకు ఎమ్మెల్యే సూచించారు.

అమ్మవారికి ఎంపీ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ అప్పలనాయుడు తదితరులు

రణస్థలం: కోటపాలెం గ్రామంలోని భద్రమహంకాళీ అమ్మవారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

టీజీఐ పరిశ్రమ పరిశీలన

గార: మండలంలోని సతివాడ వద్ద ఉన్న ట్రాన్స్‌వరల్డ్ గార్నెట్ పరిశ్రమను ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం పరిశీలించారు. ముడిసరుకు, సముద్రం ఇసుక నిల్వల వివరాలను మైన్స్, విజిలెన్సు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తామన్నారు.

ఘనంగా మారు రథయాత్ర



మారు రథయాత్రలో పాల్గొన్న భక్తులు

గార: కళింగపట్నం పంచాయతీ పెద్దపల్లిపేట కోదండ రామాలయంలో జగన్నాథుని మారు రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రాజగోపాలచార్యులు, మహేంద్రాడ కోదండ రామాచార్యులు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా కంద్రపేట స్వదేశీ మత్స్యకారుల భజనలు అలరించాయి.

జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించిన ఆయన కేసుల వివరాలు అడిగి కేసులు తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలపై ఆరా తీశారు. ఇసుక, గంజాయి ప్రభావం మండలంపై ఎంత వరకు ఉంటుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా శాంతి భద్రతలపై పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. జె.ఆర్.పురం సీఐ రామచంద్రరావు, ఎస్సై కె.గోవిందరావు, సిబ్బంది ఉన్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. చెట్టుపొదిలాం ఎంపీటీసీ సభ్యురాలు పట్నాన శాంతి అత్త సూరమ్మ గుండె సమస్యతో బాధపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అందరూ బాగా పని చేశారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. స్థానిక సర్పంచ్ భూపతి సురేష్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, ఎందువ మురళీ, కిల్లారి చిన్నంనాయుడు, పట్నాన దాలిరాజు ఉన్నారు.

కొనసాగుతున్న జగన్నాథ ఉత్సవాలు



గుజరాతిపేటలో శ్రీరామ పట్టాభిషేక అవతారం



పాండ్రంగి వీధిలో జగన్మోహినిగా..

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని జగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా గుజరాతిపేటలో జగన్నాథుడిని శ్రీరామ పట్టాభిషేక అవతారంలో మంగళవారం అలంకరించారు.భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శించుకున్నారు. పాండ్రంగివీధిలోని రామమందిరంలో జరుగుతున్న రథయాత్రలో భాగంగా స్వామివారిని జగన్మోహినిగా అలంకరించారు. అర్చకులు వేదుల ప్రదీప్ స్వామిని అలంకరించి పూజలు చేశారు.

19 నుంచి గురుపౌర్ణమి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం సాయిదర్బార్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు గురుపూర్ణిమ ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 19న సహస్ర కుంకుమార్చనలు, 20న మూలవిరాట్‌కు 108 కలశాలతో అభిషేకాలు, సాయంత్రం భక్తి సంగీత విభావరి, 21న గురుపౌర్ణమి రోజున రొట్టెల పండుగ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నప్రసాద వితరణ, తిరువీధి ఉంటుందని తెలిపారు. జెడ్పీ ఎదురుగా ఉన్న షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో సాయిగిరి కొండపై గురు పౌర్ణమి వేడుకలు జరగనున్నాయి.

- గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరి దేవీపీఠంలో గురుపౌర్ణమి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

అంబరాన్నంటిన సంబరాలు



ఆకట్టుకున్న వేషధారణలు



తప్పెటగుళ్ల ప్రదర్శన



ముత్యాలమ్మకు పూజలు



పూజలందుకుంటున్న మరిడమ్మతల్లి



కోలాటం ప్రదర్శన

శ్రీకాకుళం నగరంలో గ్రామదేవత ఉత్సవాలు అంబరాన్నంటాయి. మంగళవారం పెద్దరెల్లివీధి, రెల్లవీధి, కంపోస్టు కాలనీ వద్ద మరిడమ్మ, కొన్నావీధిలోని పాదాలమ్మ, పుణ్యపు వీధిలోని దుర్గమ్మ, న్యూకాలనీలోని నీలమ్మ, ఎల్‌బీఎస్ కాలనీలో ముత్యాలమ్మకు చల్లదనం ఉత్సవాల మహిళలు ముర్రాటలు సమర్పించారు. మేళతాళాలు, వేషధారణలు, కోలాటాలు, డప్పుల మోతలతో నగరమంతా సందడి వాతావరణం నెలకొంది.

– శ్రీకాకుళం కల్చరల్